క్లుప్తంగా

వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థికి గోల్డ్ మెడల్



అవార్డు తీసుకుంటున్న సంధ్యారాణి

మహానంది: మహానంది వ్యవసాయ కళాశాలలో 2021– 23లో పీజీ చేసిన విద్యార్థిని సంధ్యారాణికి యూనివర్సిటీ గోల్డ్ మెడల్ అందించినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి తెలిపారు. శనివారం ఏడీ మాట్లాడుతూ కళాశాల అగ్రానమి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లీశ్వర రెడ్డి ఆధ్వర్యంలో వల్లూరి సంధ్యారాణి శనగ పంటలో రైజోబియం, సీవిడ్ ప్రభావం అంశంపై పరిశోధన పూర్తి చేశారన్నారు. ఈనెల 24న ఎన్జీ రంగా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మి ద్వారా బంగారు పతకం అందుకున్నారన్నారు.

మహానందీశ్వరుడికి అధికారుల పూజలు


అధికారులను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

మహానంది: ఆంధ్రప్రదేశ్ స్టేట్ హైవేస్ ఎస్ఈలు శ్రీనివాసరెడ్డి, మహేశ్వర రెడ్డి శనివారం మహానందీశ్వర స్వామిని దర్శించుకున్నారు. వారికి అంతకుముందు ఆలయ ఏఈఓ మధు, సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య స్వాగతం పలికారు. కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామిని దర్శన అనంతరం వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

పైరును కాపాడుకోవాలి


మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న మండల ఏఓ మహేశ్వరరెడ్డి

పాములపాడు: మొక్కజొన్న పైరును కత్తెర పురుగు బారి నుంచి కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి రైతులకు సూచించారు. శనివారం రుద్రవరం పరిధిలోని మొక్కజొన్న పైరును పరిశీలించి, కత్తెర పురుగు నివారణకు పలు సూచనలు ఇచ్చారు. అలాగే జూటూరు రైతు సేవా కేంద్రంలో సర్పంచ్ సావిత్రమ్మతో కలిసి ఏఓ మహేశ్వరరెడ్డి రైతులకు ఎరువులు అందజేశారు.

దుప్పట్ల పంపిణీ


విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పోలీసులు

బండి ఆత్మకూరు: మండలంలోని నారాయణాపురం నారపురెడ్డి కుంట గిరిజన గూడేన్ని శనివారం రూరల్ సీఐ శ్రీనివాసుల్ రెడ్డి, ఎస్ఐ జగన్‌మోహన్ సందర్శించారు. అక్కడి గిరిజన పాఠశాల విద్యార్థులకు దుప్పట్లు, పలకలు, పుస్తకాలు అందజేశారు.

వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన


బైపాస్ రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

వెలుగోడు: పట్టణ శివారులో వరద ప్రభావిత ప్రాంతాలు బైపాస్ రోడ్డు, రాళ్లవాగును తహసీల్దార్ శ్రీనివాసులు గౌడు, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ వేల్పుల జయపాల్, పంచాయతీ కార్యదర్శి నాగేంద్రగౌడు పరిశీలించారు. రాళ్ల వాగు ఆక్రమణల కారణంగా వరద నీరు బైపాస్ రోడ్డుకు వస్తున్నట్లు స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. త్వరలో శాశ్వత పరిష్కారం చూపుతామని అధికారులు వారికి హామీ ఇచ్చారు.

స్పిల్ వే నుంచి నీరు విడుదల


స్పిల్ వే నుంచి నీరు విడుదల చేస్తున్న దృశ్యం

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోని స్పిల్ వే నుంచి నాలుగు గేట్లు ఎత్తి 8 వేల క్యూసెక్కుల నీటిని శనివారం దిగువకు విడుదల చేసినట్లు ఏఈ శ్రీనివాస నాయక్ తెలిపారు. బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వీబీఆర్‌కు 11 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. వీబీఆర్ నుంచి మద్రాస్ కాల్వకు 10 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం వీబీఆర్‌లో 15.234 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ చెప్పారు.


బండిఆత్మకూరులో నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు


అపరిశుభ్ర వాతావరణంలోనే దుస్తులు ఉతుక్కుంటున్న విద్యార్థులు


మహానందిలో అంధకారంలో వసతిగృహ ఆవరణం

సం'క్షామ' హాస్టళ్లు!

మరుగుదొడ్లకు తలుపుల్లేవ్.. సరిపడా స్నానాల గదుల్లేవ్.. డైనింగ్ హాళ్లు లేవ్.. గదులకు తలుపుల్లేవ్.. అక్కడక్కడా ఉన్నా కిటికీల్లేవ్.. ఆరుబయటే అత్యవసరాలు కానిచ్చేయాలి.. ఆరు బయటే స్నానాలు చేసేయాలి. ఒకపక్క చలికి వణుకుతూ.. మరోపక్క దోమల బెడదకు అరకొర నిద్రతోనే సరిపెట్టుకోవాలి. ఇక భోజనం నాణ్యత దేవుడెరుగు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది పెట్టిందే తినాలి. లేకపోతే కడుపు మాడ్చుకోవాలి. ఇదీ 'సాక్షి' విజిట్‌లో వెల్లడైన సంక్షేమ హాస్టళ్ల దుస్థితి.

అసౌకర్యాల మధ్య హాస్టళ్ల విద్యార్థులు
- శిథిలమైన బాత్‌రూమ్స్, టాయ్‌లెట్లు
- శుభ్రతకు నోచుకోని గదులు
- కిటికీలు, వాకిళ్లు లేక తీవ్ర ఇబ్బందులు
- కార్పెట్లు, దుప్పట్లు అందక చలికి గజగజ వణుకుతున్న విద్యార్థులు
- 'సాక్షి' విజిట్‌లో ఆసక్తికర ఘటనలు వెలుగులోకి..


మహానంది మండలంలోని ఆశ్రమ పాఠశాలలో నిద్రిస్తున్న విద్యార్థులు

ఆత్మకూరు: శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లోని పలు హాస్టళ్లను ఈనెల 24, 25 తేదీలలో సాక్షి విజిట్ చేసింది. ఈసందర్భంగా సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ఘటనలు వెలుగుచూశాయి. చాలా వసతిగృహాళ్లో సరిపడా టాయ్‌లెట్లు, బాత్‌రూంలు లేక విద్యార్థులు ఆరుబయట బహిర్భూమికి వెళ్లడం కనిపించింది. ఆరుబటే కుళాయిల వద్ద స్నానాలు చేస్తున్నారు. డార్మెట్రీలకు కిటికీలు లేక దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వసతి గృహాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు దుర్వాసన వెదజల్లుతున్నాయి. కూటమి ప్రభుత్వం దుప్పట్లు పంపిణీ చేయకపోవటంతో చలికి వణుతున్నారు. బాలికల హాస్టళ్లకు భద్రత కరువైంది. ప్రహరీ లేకపోవటంతో విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- ఆత్మకూరులో ఎస్సీ, ఎస్టీ, బీసీ సమీకృత, ఎస్సీ బాలికల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ వసతిగృహాలతోపాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాలికల వసతిగృహం ఉంది. ఏ ఒక్క వసతిగృహంలోననూ పరిసరాలు శుభ్రంగా లేదు. విద్యార్థులు రాత్రిపూట బండపరుపుపై చాలీచాలని దుప్పట్లతో నిద్రిస్తున్నారు. అసలే వర్షాకాలం కావడం, కిటికీలు లేకపోవడంతో కాళ్లు ముడుచుకుని చలికి జగజగ వణుకుతూ నిద్రిస్తున్నారు. దోమల బెడదతో జ్వరాల బారిన పడిన విద్యార్థులు కూడా ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ సమీకృత వసతిగృహంలో బండపరుపు పూర్తిగా కుంగిపోయింది. వసతిగృహంలో 70 మంది విద్యార్థులున్నారు. మరుగుదొడ్లు దుర్వాసన వస్తున్నాయి. వీటికి డోర్లు కూడా లేవు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని విద్యార్థినులకు ఈ ఏడాది దుప్పట్లు ఇవ్వకపోవడంతో చలికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎస్సీ బాలికల వసతిగృహంలోని విద్యార్థినులను మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా వేధిస్తోంది.
- వెలుగోడు మండలం వేల్పనూరులో ఒకే ఎస్సీ వసతిగృహం ఉంది. అందులో 80 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఈ ఏడాది ప్రభుత్వం పెట్టెలు, దుప్పట్లు ఇవ్వకపోవడంతో చిరిగిపోయిన వాటితోనే నెట్టుకొస్తున్నారు.
- మహానంది మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 150 మంది విద్యార్థులు ఉన్నారు. ఇరుకు గదుల మధ్యే విద్యార్థులు నిద్రించాల్సిన పరిస్థితి ఉంది. ఉదయం తరగతి గదులు, రాత్రి అదే తరగతి గదుల్లోనే నిద్రిస్తున్నారు. వర్షపు నీరంతా వసతిగృహం ఆవరణలో నిలుస్తుండటంతోపాటు సరైన విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రివేళ అంధకారంలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.


బండిఆత్మకూరులో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు


ఆత్మకూరు ఎస్సీ, ఎస్టీ వసతిగృహంలో మరుగు దొడ్ల దుస్థితి

- బండిఆత్మకూరు మండలంలో బీసీ బాలుర వసతిగృహంలో 60 మంది పిల్లలు ఉండగా వారికి దుప్పట్లు లేకపోవడంతో ఇబ్బదులు పడుతున్నారు. ఒక్కో గదిలో 15 మంది విద్యార్థులకు గానూ రెండు ఫ్యాన్‌లు మాత్రమే ఉన్నాయి. కిటికీలకు అక్కడక్కడా జాలర్లు లేకపోవడంతో దోమల సమస్య తీవ్రంగా ఉంది. ఐదు మరుగుదొడ్లు, ఐదు స్నానపు గదులు మాత్రమే ఉండడంతో సరిపోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న బాత్‌రూంలు కూడా అపరిశుభ్రంగా కనిపించాయి.


ఆత్మకూరులోని హాస్టల్‌లో కుంగిన బండపరుపు

కనీస వసతులు కరువు


బీసీ బాలుర హాస్టల్ కిటికీలకు డోర్లు లేని దృశ్యం


జూపాడుబంగ్లా బాలుర గురుకుల వసతి గృహంలో తలుపులు లేని మరుగు దొడ్లు


మరమ్మతులకు నోచుకోని ఫ్యాన్లు


డార్మెట్రీ లేకపోవటంతో ఒకే గదిలో ఉంచిన విద్యార్థినుల లగేజ్

నందికొట్కూరు: ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని కూటమి ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఎక్కడా కనిపించడం లేదు. ఆవరణకు నోచుకోకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో మిడుతూరు, నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి ఎస్సీ, బీసీ సంక్షేమ, గురుకుల హాస్టళ్లు 12 ఉన్నాయి. 1,153 విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. చాలా వసతి గృహాల్లో బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల కనీసం మినరల్ వాటర్ కూడా సరఫరా కాకపోవడంతో బోరు వాటర్‌తోనే విద్యార్థులు దాహం తీర్చుకుంటున్నారు. కిటికీలు, తలుపులు లేక పోవడంతో విద్యార్థులు దోమలతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. అసలే వర్షాకాలంలో కావడంతో దుప్పట్లు లేక చలికి వణికిపోతున్నారు.

- జూపాడుబంగ్లాలోని గురుకుల, కస్తూర్బా, మోడల్, ఎస్సీబాలికల వసతిగృహాల్లోని విద్యార్థులు అసౌకర్యాల నడుమ విద్యను అభ్యసించాల్సిన దుస్థితి నెలకొంది. 625 మంది విద్యార్థులున్న గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, స్నానాల గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 277 మంది విద్యార్థినులున్న కేజీబీవీ ప్రహరీ లేకపోవడంతో అభద్రతా భావం నెలకొంది. మోడల్‌స్కూల్ హాస్టల్‌లో మంచాలు, పరుపులు చిరిగిపోయాయి.

యూరియా సరఫరా చేయాలి


మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

కొత్తపల్లి: అవసరమైన రైతులందరికీ యూరియాను అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రాజశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం సింగరాజు పల్లి గ్రామంలో రైతుసంఘం నాయకుడు శంకర్ రెడ్డి అధ్యక్షతన రైతు సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఒక్కో పట్టాదారు పాసుపుస్తకానికి ఒకటి, రెండు బ్యాగుల యూరియాను ఇచ్చి అధికారులు చేతులు దులుపుకుంటున్నారన్నారు. రూ.266 యూరియా రూ.310 నుంచి రూ.350 దాకా ప్రైవేట్ డీలర్లు విక్రయిస్తూ బిల్లు మాత్రం రూ.266 ఇస్తున్నారన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా గంగన్న, ఉపాధ్యక్షులుగా శంకర్ రెడ్డి, వెంకటేశ్వర గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్ సంజీవరాయుడు, సహాయ కార్యదర్శిగా జి దాసును ఎన్నుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

నందికొట్కూరు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరారు. శనివారం పార్టీ కార్యాలయం నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. జైకిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన పట్టణ రెండో మహాసభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రఘురామమూర్తి, శ్రీనివాసులు, రజిత, దానమ్మ, భాను, వెంకటేశ్వర్లు, రాముడు, సుంకన్న, వీరస్వామి, జగదీష్, రామకృష్ణ పాల్గొన్నారు.

నోటుపుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు/వెలుగోడు: ఆత్మకూరు, వెలుగోడే పట్టణాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఫౌజియా కరీం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నోటు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఆయా చోట్ల ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఫౌండేషన్ సహాయ కార్యదర్శి ముల్లా అబ్దుల్ కుద్దూస్ మాట్లాడుతూ చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమన్నారు. అవకాశాలను అందిపుచ్చుకుని చదువులో బాగా రాణించాలని సూచించారు. పేద విద్యార్థులకు తమ సంస్థ తరపున ఆర్థిక సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు.

మత్తుపదార్థాల జోలికి వెళ్లొద్దు


ర్యాలీ నిర్వహింపజేస్తున్న ఎస్ఐ, పోలీసుసిబ్బంది

జూపాడుబంగ్లా: మత్తుపదార్థాల జోలికి వెళ్లొద్దని ఎస్ఐ లక్ష్మినారాయణ విద్యార్థులకు సూచించారు. శనివారం విద్యార్థులతో కలిసి డ్రగ్స్ వద్దు..చదువే ముద్దు నినాదాలతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. సిగరేట్, మద్యం, పొగాకు తదితర మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ సూచించారు.

వేతనాలు చెల్లించాలి

జూపాడుబంగ్లా: గ్రీన్‌అంబాసిడర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కన్వీనర్ కర్ల డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని 80బన్నూరు గ్రామసచివాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్లతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో గ్రీన్‌అంబాసిడర్ల కుటుంబాల జీవనం కష్టతరంగా మారిందన్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి

జూపాడుబంగ్లా: ఉపాధి పనుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహనాయక్ కోరారు. శనివారం ఆయన జూపాడుబంగ్లాలో మాట్లాడుతూ బడ్జెట్‌లో నిధులు తగ్గించటంతోపాటు కూలీలకు 100 రోజుల పనిదినాలు మాత్రమే కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా యత్నిస్తుందని ఆరోపించారు.

స్మార్ట్ మీటర్లను అడ్డుకోండి

నందికొట్కూరు: కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే అడ్డుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ సూచించారు. శనివారం పగిడ్యాల మండలంలోని బీరహోలు గ్రామంలో ఏర్పాటు చేసిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం నాయకులు గంధం హుసేనమ్మ, నాగేశ్వరరావు, ఫక్కీర్‌సాహెబ్, ఈశ్వరమ్మ, తిక్కస్వామి, బాబు, మద్దమ్మ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

ఆత్మకూరు: స్థానిక పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయంలో శనివారం సమాచార హక్కుచట్టం -2005పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్డీఓ నాగజ్యోతి, జిల్లా పట్టు పరిశ్రమ అధికారి నగేష్, లాయర్ ఆడిగ శ్రీధర్ మాట్లాడుతూ కావాల్సిన సమాచారాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకుంటే 30 రోజుల్లోపు సంబంధిత అధికారి అందజేస్తారన్నారు.

లింగాలగట్టు బ్రిడ్జి తనిఖీ

శ్రీశైలంప్రాజెక్ట్: లింగాలగట్టు వద్ద నిర్మించిన ఆంధ్రా–తెలంగాణ వారధిని శనివారం నేషనల్ హైవే అథారిటీ అధికారులు పరిశీలించారు. ఇటీవల గుజరాత్‌లో ఓ బ్రిడ్జి కూలిపోవడంతో కేంద్రం దేశంలోని అన్ని బ్రిడ్జీల నాణ్యతను పరిశీలించాలని ఆదేశించనట్లు రోడ్లు, భవనాలు, నేషనల్ హైవే అథారిటీ ఏఈ భార్గవ్ తెలిపారు. అందులో భాగంగా లింగాలగట్టు వద్ద 1963లో నిర్మించిన బ్రిడ్జి నాణ్యతను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

29న మున్సిపల్ సమావేశం

నందికొట్కూరు: ఈనెల 29న మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బేబి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల మండల అధికారులు సమగ్ర నివేదికలతో హాజరు కావాలని కోరారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడ వీధుల్లోని నిత్య కళావేదికపై శ్రీకాకుళానికి చెందిన ఎస్ఎం నృత్య కళాక్షేత్రం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వినాయక కౌత్యం, శివ తాండవం, లింగాష్టకం, నమశ్శివాయతే, శివోహం, భో.. శంభో, జతి స్వరం తదితర గీతాలకు అష్టకాలకు తేజేశ్వరరావు, అక్షయ, సంజన, పూజిత, విమల, గీతిక, శ్రావణి, ప్రణవి తదితరులు నృత్యప్రదర్శన చేశారు.



నృత్య ప్రదర్శనలో కళాకారులు

మోసం, కుట్ర, వెన్నుపోటులే బాబు విజన్


మాట్లాడుతున్న శిల్పా భువనేశ్వరరెడ్డి

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి

బండి ఆత్మకూరు: మోసం, కుట్ర, వెన్నుపోటు.. ఇవే చంద్రబాబు సిద్ధాంతాలని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి ఆరోపించారు. శనివారం సంతజూటూరు గ్రామంలో నిర్వహించిన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భువనేశ్వరరెడ్డి మాట్లాడారు. గత ఎన్నికల్లో సూపర్ –6 పేరుతో అమలు సాధ్యం కాని హామీలిచ్చి, అధికారం చేపట్టిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేస్తుండటం తగదన్నారు. అధికారంలోకి రావడానికి అడ్డమైన హామీలిచ్చి ఇప్పుడు రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఎర్రగుంట్ల గ్రామ పొగాకు రైతుల గోడు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి వినిపించడం లేదన్నారు. చంద్రబాబు అబద్ధపు హామీలు, స్థానిక సమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యే బుడ్డా గురించి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దూరదృష్టితో ఆలోచించి శ్రీశైలం దేవస్థానానికి 5 వేల ఎకరాల భూమిని, సున్నిపెంటను గ్రామ పంచాయతీని చేయించారన్నారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో పూర్తి స్థాయి నీటిమట్టం 18టీఎంసీల నిలువ వంటి మరెన్నో శాశ్వతమైన పనులు చేసిన ఘనత చక్రపాణి రెడ్డిదే అన్నారు. హామీల అమలులో విఫలమైన కూటమి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు బారెడ్డి విజయభాస్కర్ రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ముడిమేల పుల్లారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, కొంగిసు శివశంకర్, భూమ రఘునాథ్ రెడ్డి, నషం శ్రీనివాస్ రెడ్డి, బారెడ్డి అశోక్ రెడ్డి, దూదేకుల మౌలాలి, దేకిరెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అ'పూర్వ' సంకల్పం


శ్రీనివాసులు భార్య అపర్ణకు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వెలుగోడు: స్నేహం ఏ నిర్వచనానికి అందనంత గొప్పది. ఏ బంధానికీ సాటిరానంత ఉన్నతమైందని నిరూపించారు వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు. కష్టాల్లో ఉన్న తమ స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు ఏకమయ్యారు. వెలుగోడు జిల్లా ఉన్నత పాఠశాలలో 1997–1998వ సంవత్సరంలో పదో తరగతి చదివిన కంభం శ్రీనివాసులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కుటుంబ యజమాని అకాల మరణంతో భార్య అపర్ల, ముగ్గురు పిల్లల పోషణ భారంగా మారింది. విషయం తెలుసుకున్న స్నేహితులు చేయిచేయి కలిపి రూ.50,500 పోగు చేసి శనివారం శ్రీనివాసులు భార్య అపర్ణను కలిసి డబ్బును అందించి, అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకున్న పూర్వ విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఖాదర్‌వలి, ఎల్లా శేషులు, రాజశేఖర్, గోవర్ధన్, జావీద్ రాఫ్ తదితరులు పాల్గొన్నారు.